
# సన్మానం

### ఇలపావులూరి మురళీమోహనరావు




కాలింగ్ బెల్ చప్పుడయింది.

"ఎవరో చూడు సుందరూ" అన్నాడు వెంకట్రావు పేపర్ చదువుకుంటూ.

సుందరి విసుక్కుంటూ వెళ్లి తలుపు తీసింది.

"నమస్కారం వెంకట్రావు గారూ" అంటూ ముగ్గురు అపరిచిత వ్యక్తులు లోపలకు ప్రవేశించారు.

ఎవరో అర్థంకాక వెంకట్రావు లేస్తూ తల ఆడించాడు.

"నా పేరు పద్మశ్రీ అండి. నేను అధ్యక్షుడిని. ఇతనిపేరు పద్మభూషణ్. ఇతడు ఉపాధ్యక్షుడు. అతని పేరు జ్ఞాన పీఠమూర్తి అతను కార్యదర్శి."

వెంకట్రావుకు అర్థం కాలేదు.

"దేనికి అధ్యక్షులో చెప్పలేదు. ఏదైనా మండలానికా, జిల్లాకా, పార్టీకా?" అడిగాడు.

"క్షమించాలి. చెప్పలేదు కదా. శివం ఆర్ట్ థియేటర్స్ పేరు విన్నారా?"

"విన్నాను. విన్నాను. వారాని కోమారు ఎవరెవరికో ఉత్తమ నటులనీ, కవులనీ, డాన్సర్లనీ సన్మానాలు

చేస్తుంటారు. వారే గదా!"

"ఎగ్జాక్ట్లీ కరెక్ట్. మేమే."

వెంకట్రావు ముఖం వెలిగింది. షేక్ హ్యాండిచ్చాడు ముగ్గురికీ.

"మీ పేర్లు, ఫోటోలు ఎప్పుడూ పేపర్లో చూస్తుంటాము. మీరు మా ఇంటికి రావడం చాలా సంతోషంగా ఉన్నది" అన్నది సుందరి వంటింట్లోకి వెళ్తూ.

"మీ బోటి గొప్పవారు మా ఇంటికి రావడం చాలా ఆనందదాయకమైన విషయం. మీ కార్యక్రమాల్లో ఎంతో మంది ప్రఖ్యాత సినీ తారలు, మంత్రులు పాల్గొంటారు. అనేక సార్లు కార్యక్రమా లకు వచ్చి సీట్లు దొరక్క వెనక్కు వచ్చాం. ఇంతకూ మా ఇంటికి రావడంలో విశేషం?" కుతూహలంగా అన్నాడు వెంకట్రావు.

పద్మశ్రీ నవ్వాడు.

"అక్కడికే వస్తున్నాం. ఇంత కాలం సినిమా తారలకు, మంత్రులకు సన్మానాలు చేసి చేసి విసుగెత్తి పోతోంది. అందుకని కొన్నాళ్ల పాటు సమాజ సేవ చేయ్యాలని మా అసోసియేషన్ తీర్మానించింది. అందులో భాగంగా మొదట మీకు సన్మానం చెయ్యాలని నిర్ణయించాం" అన్నాడు.

వెంకట్రావుకు నిముషం పాటు తెరచిన నోరు మూత పడలేదు. తనను తాను గిల్లి చూసుకున్నాడు. తాను బతికే ఉన్నట్లు నిశ్చయించుకున్నాడు.

"నా..నా..నాకు.. స..న.. సన్మానమా?" తడబడుతున్నట్లు అనగలిగాడు.

"మీ ఒక్కరికే కాదు. మీ ఆలుమగలకు" అన్నాడు పద్మశ్రీ.

"మా ఆలుమగలకా! ఎందుకు? ఆశ్చర్యానందాలతో.

పద్మభూషణ్ విలాసంగా నవ్వాడు.

"వచ్చే సోమవారం, పదిహేనవ తారీఖుతో మీకు వివాహమై పది సంవత్సరాలు నిండుతాయి. దశాబ్ద కాలం పాటు విజయవంతమైన దాంపత్య జీవితం గడిపినందుకు మా సంస్థ తరఫున గుర్తింపుగా" అన్నాడు.

ఇంతలో సుందరి ఒక ట్రేలో ఐదు కప్పులు బోర్నవిటా కలిపి తీసుకు వచ్చింది. తలా ఒక కప్పు ఇచ్చి తాను ఒకటి తీసుకుంది.

అందరూ కప్పులు అందుకుని తాగారు.


'విన్నావా సుందూ. వీళ్లు మనకు సన్మానం చేస్తారట' అన్నాడు వెంకట్రావు.

"ఎందుకు?" అడిగింది సుందు.

జ్ఞానపీఠ మూర్తి విషయం వివరించాడు.

"పది సంవత్సరాలు కాపురం చెయ్యడంలో విశేషం ఏముందండీ? అందరూ చేస్తున్నదేగా." అన్నాడు వెంకట్రావు.

"అమ్మమ్మమ్మ... అంత మాటనకండి. ఈ మోడ్రన్ యుగంలో భార్యాభర్తలు పది సంవత్స రాలు కలిసి కాపురం చెయ్యటమంటే మాటలా? జిహ్వాకోరుచి మనిషికో అభిరుచి. ఇద్దరూ చదువు కున్నవారు. స్వతంత్ర భావాలు కలవారు. పెళ్లయిన సంవత్సరం లోపే విడాకులకు సిద్ధమౌతున్న ఈ రోజులలో మీరిద్దరు దశాబ్ద కాలం పాటు దిగ్విజయంగా సంసార యాత్ర సాగించారంటే నిస్సందేహంగా మీరు సన్మానార్హులే" కొంచెం ఉద్వేగంగా అన్నాడు జ్ఞాన పీఠమూర్తి.




వెంకట్రావు క్షణ కాలం మొహమాటపడ్డాడు. కానీ అంతలోనే తమాయించుకున్నాడు.

'నాకు తెలిసి ఎందరో దంపతులు ముప్పై నలభై ఏళ్ల నుండి కాపురాలు చేస్తున్నారు. ఒకసారి పెళ్లయిన తరువాత ఆరు నూరైనా నూరు ఆరైనా చచ్చే వరకూ కలిసి ఉండటం భారత సంప్రదాయం. అలాగే మేమూ ఉంటున్నాం. ఈ మాత్రం దానికి సన్మానం ఏమిటండీ?' అన్నాడు.

పద్మ భూషణ్ పక పక నవ్వాడు.

"ఎంత మాట! మీరు చెప్పేది పాత తరాల మాట. నాకు తెలిసి ఎంతో మంది పెళ్లయిన ఆరు నెలలకే తన్నుకుని తలలు పోసుకుని ఎవరి దారిన వారు వెళుతున్నారు. ఎంతో మంది ఆడపిల్లలు అత్తిళ్లలో ఆరళ్లు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మరి కొంత మంది కోర్టుకు వెళుతున్నారు. మీరు లక్ష చెప్పండి. మిమ్మల్ని ప్రఖ్యాత సినీతార తిలోత్తమ చేత సన్మానింప జేయాలి. మంత్రిగారి చేత బిరుద ప్రదానం చేయించాల్సిందే" అన్నాడు.

తిలోత్తమ పేరు చెప్పగానే వెంకట్రావు చప్పబడ్డాడు. తిలోత్తమ కోట్లాది మంది ప్రేక్షకులకు అభిమాన తార. ఆమెపేరు వింటేనే మగవారు చొంగలు కార్చుకుంటారు. నిజం చెప్పాలంటే వెంకట్రావుకు కూడా తిలోత్తమ అంటే చచ్చే పిచ్చి. 'మాకు తిలోత్తమ చేత సన్మానమా!' ఆశ్చర్యంగా అడిగాడు.

"మరి! శివం ఆర్ట్ థియేటర్స్ అంటే ఏమను కున్నారు? మా సభ అంటే సినిమా తారలు, మంత్రులు, కేంద్రమంత్రులు క్యూలో నిలుచుం టారు. నంది అవార్డునైనా 'ఛీ' కొడతారు కానీ శివం అవార్డు అంటే అమెరికాలో ఉన్నా వచ్చి అందుకుంటారు" అన్నాడు పద్మభూషణ్.

"ఒక్క నిముషం" అని వెంకట్రావు సుందరిని లోపలకు తీసుకు వెళ్లాడు.

"వీళ్లు చెబుతున్న దాంట్లో కొంచెమైనా నిజం లేకపోలేదు. మా బాబాయి కొడుకు పెళ్లయిన మూడు నెలలకే విడాకులు తీసుకున్నాడు. మీ పిన్నిగారి కూతురు సంవత్సరం లోపే మొగుడితో తగాదాలాడి పుట్టింటికి వచ్చింది. ఇటువంటి వాటిని దృష్టిలో పెట్టుకుంటే మనం ఆదర్శదంపతుల మైనట్లే లెక్క. సన్మానం ఒప్పుకుందామా?" అడిగాడు.

'నాకూ చేయించుకోవాలనే ఉంది. కానీ బాగుంటుందో బాగుండదోనని ఆలోచిస్తున్నాను.'

ఇద్దరూ బయటకు వచ్చారు.

"సరే. కానివ్వండి. మీరు అంతగా బలవంతం చేస్తుంటే కాదనడం బాగుండదు కదా. మరి ఎలా చెయ్యాలనుకుంటున్నారు?" అడిగాడు వెంకట్రావు.

ఊపిరి పీల్చుకున్నారు కార్యకర్తలు.

"రవీంద్ర భారతి అయితే బాగుంటుంది. ఎలాగూ తిలోత్తమను పిలుస్తాం కాబట్టి జనం విరగబడతారు. అలాగే మంత్రిగారి చేత బిరుదు ప్రదానం చేయిస్తాం. సన్మానానికి కావలసిన సరంజామా అంతా మేమే తెచ్చుకుంటాం. మీకు సన్మానం చేస్తున్నామని ముందు పత్రికా ప్రకటన ఇస్తాం. మీరు మీ బంధువులకు, ఆత్మీయులకు అందరికీ చెప్పుకోండి. ఇక సెలవు" అని లేచారు.


మర్నాడు అన్ని దిన పత్రికలలో వెంకట్రావు దంపతులకు సన్మానం జరుగుతున్నట్లు వార్త వచ్చింది. లక్షలాది మంది చదివే పేపర్లలో తమ పేర్లు కనపడగానే మురిసి పోయారు దంపతు లిద్దరూ. రెండు వాక్యాల ప్రకటనను రెండు వందల సార్లు చదివారు. అయినా ప్రతీ సారీ కొత్తగానే కనిపించసాగింది. కాలనీ మొత్తం టాంటాం వేశారు. కనపడిన ప్రతి వారినీ సభకు రమ్మని బతిమాల సాగారు.

మరుసటి రోజు కార్యకర్తలు ముగ్గురూ వచ్చారు.

"పత్రికలలో వార్త చూశారుగా" అన్నాడు పద్మశ్రీ.

'చూశామండీ. చాలా సంతోషం. కూర్చోండి' నవ్వుతూ అన్నాడు వెంకట్రావు.

"రవీంద్ర భారతిని బుక్ చేశాం. తిలోత్తమ రావడానికి అంగీకరించింది. ఆమెకు రాత్రి కూడా షూటింగ్ ఉందట. అందుకని ఏడు గంటలకు వచ్చి జ్యోతి వెలిగించి ఏడూ ఆరు నిముషాలకు వెళ్తుందట. మంత్రిగారిని అంగీకరింపజేశాం. ఒక యూనివర్సిటీ ప్రొఫెసరర్ గారు గెస్ట్‌గా వస్తారు. 'వాగుడు కాయ' బిరుదాంకితులు




అని అతిథులను ఆహ్వానించాడు.

ఒక్కొక్కరు వేదిక మీదికి రాగానే పద్మభూషణ్, జ్ఞానపీఠమూర్తి పూల మాలలు వేశారు. అందరూ ఆసీనులైనారు.

'వాగుడుకాయ' సూర్యారావు మైకు అందుకున్నాడు.

"అందరికీ నమస్కారం. భార్యాభర్తలు అతి కొద్ది కాలంలోనే బద్ధ శత్రువులుగా మారిపోతున్న ఈ కాలంలో వెంకట్రావు, సుందరిగార్లు దశాబ్దం కాలం పాటు కలసి మెలసి ఉన్నందుకు నిస్సందేహంగా వారు సన్మానార్హులే. ఈ పదేళ్లలో వారు ఎన్నో మార్లు తిట్టుకుని ఉండవచ్చు. కొట్టుకుని ఉండవచ్చు. కానీ..."

వెంకట్రావు, సుందరిల ముఖాలు మాడిపోయాయి.

"ఈయనకు 'వాడుగుకాయ' అనే బిరుదు ఎవరిచ్చారో కానీ సార్థకమైన బిరుదు" అన్నది సుందరి వెంకట్రావు చెవిలో.

"ఇంకెవరు? వీళ్లే అయి ఉంటారు" అన్నాడు వెంకట్రావు పళ్లు కొరుకుతూ.

"కలిసి కాపురం చేస్తున్నారా లేదా అన్నదే పాయింటు. నిజానికిది గిన్నీస్ బుక్‌లో ఎక్కాలి. త్వరలో నేను అమెరికాలో జరగబోయే తెలుగు మహాసభలో ఈ విషయాన్ని ఎలుగెత్తి చాటుతాను. క్షమించాలి. ఎక్కువ సేపు మాట్లాడానేమో. ఇపుడు అందాల తార కుమారి తిలోత్తమ జ్యోతి వెలిగించి దంపతులకు శుభాకాంక్షలు పలుకుతారు" అని కూర్చున్నాడు.

తిలోత్తమ నిముషానికి పదిసార్లు నవ్వుతూ వయ్యారంగా నడుస్తూ జ్యోతి వెలిగించింది.

తిలోత్తమ అందచందాలను కళ్లతోనే ఆస్వాదిస్తున్న ప్రేక్షకులు చప్పట్లు మార్మోగించారు. తిలోత్తమ మైకు అందుకుంది. ఊరికే నవ్వుతున్నది. ముఖం మీదికి జారుతున్న తల నీలాలను సెకనుకో సారి పైకి నెట్టుకుంటున్నది.

"హందరికీ శుభాకాంక్షలు. నేను మద్రాస్‌లో పుట్టి, బెంగుళూరులో పెరిగి, పంజాబ్‌లో చదివి, మహారాష్ట్రలో మోడల్‌గా చేసి మళయాళం సిన్మాలలో యాక్ట్ చేశాను. నాకు యాక్టింగ్ రాదని అన్ని భాషల వాదులూ వేషాలివ్వలేదు. టెల్గు వాదులు నన్ను పోరోత్సయించారు. అందుకని నాకు ఏ లాంగ్వేజ్ సరింగా రాదు. టప్పులేవైనా ఉంతే నన్ను..ష..ష" అటూ ఇటూ చూడసాగింది.

"క్షమించాలి" అందించాడు సూర్యారావు.

కేరింతలు కొట్టింది తిలోత్తమ. "యస్..యస్.... షమించాలి."

జనమంతా పరవశంతో వినసాగారు. వాచీ చూసుకుంది తిలోత్తమ. "ఓ మైగాడ్.. నన్ను మర్లీ మీరు షమించాలి. ఈ నైట్ నాకు షూటింగ్ ఉంది. నేను వెల్లాలి. కలసి కాపురం చెయ్యడంలో పదేళ్లు పూర్తి చేసిన ఈ కపుల్‌కు త్వరలో నూరేళ్లు నిండాలని నా శుభాకాంక్షలు అందిస్తున్నాను" అని నవ్వుతూనే లేచింది.

ఆ అభినందనలకు వెంకట్రావు, సుందరిల ముఖాలు మాడిన దిబ్బ రొట్టెల్లా అయ్యాయి.

ఆమె వెనుకనే నిర్వాహకులందరూ పరిగెత్తారు. జనమంతా తిలోత్తమ ఆటోగ్రాఫుల కోసం ఎగబడ్డారు. అంతా తొడతొక్కిడిగా తయారయింది. ఆ పరిస్థితి చూసి వెంకట్రావు, సుందరిలకు చచ్చే సిగ్గేసింది. పది నిముషాల తరువాత పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది.

సూర్యారావు గారు అధ్యక్షత వహిస్తారు. 'అసందర్భ ప్రేలాపి'గా ప్రఖ్యాతి గాంచిన సినీ నటుడు శుభకాంత్ ఆశీస్సులందజేస్తారు" వివరించాడు పద్మభూషణ్.

"ఆహా! నా జన్మ ధన్యం" పరవశంగా అన్నాడు వెంకట్రావు.

"మీ వారందరికీ చెప్పుకున్నారు కదా!" అడిగాడు జ్ఞాన పీఠమూర్తి.

"ఆహా! చాలా మంది వస్తారు." అన్నాడు వెంకట్రావు.

"సంతోషం. మరి ముందుగా పది వేలు అడ్వాన్స్ ఇవ్వాలి." అన్నాడు పద్మశ్రీ.

వెంకట్రావు గాభరా పడ్డాడు.

"పదివేలు అడ్వాన్సా! ఎందుకు?" అన్నాడు.

'భలే వారండీ... సన్మానానికి ఎంత లేదన్నా కనీసం ఇరవై వేలవుతుంది. మరి ముందుగా సగం అయినా ఇవ్వకపోతే పనులు ఎలా జరుగుతాయి?' నవ్వుతూ అన్నాడు పద్మశ్రీ.

'మాకు జరిగే సన్మానానికి డబ్బు మేం ఇవ్వాల్నా?'

"మరెవరిస్తారు చెప్పండి? మీ ఇంట్లో ఏదైనా ఫంక్షన్ జరిగిందనుకోండి. దానికి డబ్బు మీరే ఖర్చు పెడతారు కదా! అలాగే ఇప్పుడు మీకు సన్మానం జరుగుతుంది. మరి మీరే భరించాలి కదా!" లాజిక్కు చెప్పాడు పద్మభూషణ్.

"మరీ సంగతి ముందు చెప్పలేదే!" కోపంగా అన్నాడు వెంకట్రావు.

"భలేవారండీ... ఇంత చిన్న విషయం కూడా మీకు చెప్పాల్నా? తెల్లారి లేస్తే మేము ఎంత మందికి సన్మానాలు చెయ్యడం లేదూ? ఎంత మంది సినిమా తారలకు బిరుదప్రదానం చేయడం లేదూ? వారి దగ్గర్నుంచయితే ముందుగానే మొత్తం డబ్బు తీసుకుంటాం" చిరునవ్వుతో అన్నాడు పద్మశ్రీ.

"డబ్బులిచ్చి సన్మానం చేయించుకోవలసిన అవసరం వారికేముందిది?" అడిగింది సుందరి.

'మరి ఊరికే మా పనిపాటలు మానుకుని వారికి సన్మానాలు చెయ్యవలసిన అవసరం మాకేముంది తల్లీ! వారికి ఉచితంగా ప్రచారం దొరుకుతుంది. మా కష్టానికి తగిన ప్రతిఫలం మాకు ముడుతుంది. మేము ఎక్కువేమీ అడగటం లేదు. మీకు వివరంగా లెక్కలు కూడా చెబుతాము' అన్నాడు జ్ఞానపీఠమూర్తి.

దిమ్మ తిరిగిపోయింది దంపతులకు. లోపలకు వెళ్లి గుసగుస లాడుకున్నారు.

"ఊరంతా చెప్పుకున్నాం. ఇప్పుడు మాను కుంటే పరువుపోతుంది. ఏమంటావ్?" అన్నాడు వెంకట్రావ్.

తలూపింది సుందరి.

రవీంద్ర భారతి హాలు ప్రేక్షకులతో కిటకిట లాడి పోతున్నది. అతిథులంతా విచ్చేశారు. "తిలోత్తమ రావాలి... తిలోత్తమ రాలేదా?" అని అరుపులు వినిపిస్తున్నాయి వెనుక కుర్చీల నుంచి.

"ఆదర్శ దంపతులు వెంకట్రావు - సుందరి గార్లకు సన్మానం" అని పెద్ద బ్యానర్ వ్రాసి వేదిక మీద తగిలించారు.

తిలోత్తమ రానే వచ్చింది. నిర్వాహకులు పరుగు పరుగున వెళ్లి తిలోత్తమకు గజమాల అలంకరించి అడుగువేస్తే ఆమె పాదాలు కందిపోతాయేమో అన్నంత టెన్షన్ ఫీలవుతూ, ఆమె చీర కొంగునైనా తాకడానికి ప్రయత్నిస్తూ, ఎగసిపడి వస్తున్న జన తరంగాన్ని పక్కలకు తోస్తూ ఆమెను తోడ్కొని వచ్చారు.

గౌరవనీయులైన మంత్రివర్యులు, వేలాది మందికి పాఠాలు చెప్పే ప్రొఫెసర్ గారు, వాగుడు కాయ సూర్యా రావు గారు, ఇతర పెద్దలు అత్యంత వినమ్రతతో లేచి తిలోత్తమకు రెండు చేతులు జోడించి నమస్కరించారు. ఆమె మాత్రము విలాసంగా నవ్వుతూ 'హాయ్' అనేసి కుర్చీలో కూర్చుంది.

పద్మశ్రీ గబగబా పరిగెత్తుకుంటూ స్టేజీ మీదకు వెళ్లి గొంతు సర్దుకుని స్వాగతం ఆరంభించాడు.

'సభకు అభివాదం. మేము పిలవక పోయినా వచ్చిన వారికి స్వాగతం. పిలవగానే అన్ని పనులూ మానుకుని వచ్చిన అతిథులకు కృతజ్ఞతలు. ఈ నాటి విశేషం ఒక ఆదర్శ జంటను సన్మానించటం. ఆలుమగల మధ్య అనురాగం అనేది మృగ్యమైన ఈ రోజుల్లో వెంకట్రావు, సుందరి గార్లు పది సంవత్సరాలు కలిసి కాపురం చెయ్యడం అనేది ఎంతో గొప్ప విశేషం. వారిని అభినందించడానికి వచ్చిన వారందరికీ అభినందనలు'

సభాకార్యక్రమం మళ్లీ మొదలయింది.

పద్మశ్రీ మైకు అందుకున్నాడు. కొంత మంది జనం వెళ్లిపోతున్నారు.

"మిత్రులారా. అందరూ ప్రశాంతంగా కూర్చోండి. మరో పది నిముషాల్లో హీరో శుభకాంత్ గారు వస్తున్నారని మెసేజ్ వచ్చింది" అన్నాడు.

దాంతో కొంత మంది కూర్చున్నారు. మంత్రిగారు మైకు అందుకున్నారు.

"నా సోదర సోదరీమణులారా! అందరికీ నమస్కారం. ఈ నాటి కాపురాలు కంపు కొడుతు న్నాయి మన డ్రెయినేజీల్లా. నానా చావులు చచ్చి మనం పెళ్లిళ్ల చేస్తుంటే వాళ్లిద్దరూ మూడు నెలల్లో గుద్దులాడు కుంటున్నారు. కొడుకు పెళ్లి కాక ముందు సావిత్రిలా ఉండే తల్లి పెళ్లి కాగానే, కోడలు రాగానే, సూర్యకాంతంలా తయారౌ తున్నది. పెళ్లికి ముందు వరకూ జమునలా ఉండే అమ్మాయి కాపురానికి వెళ్లగానే ఛాయాదేవిలా మారిపోతున్నది. పెళ్లికి ముందు వరకు అక్కినేని నాగేశ్వర్రావులా ఉండే అబ్బాయి పెళ్లి కాగానే రాజనాలలా తయారౌతున్నాడు...." చప్పట్ల కోసం ఆగాడు.

వాగుడుకాయ లేచాడు.

"ఆహా! అనుక్షణం రాజరికపుటెత్తులతో, రణతంత్రపు జిత్తులతో సతమతమైపోయే మంత్రిగారి సినిమా పరిజ్ఞానం అమోఘం. పాత తరం తారలను వారు గుర్తుంచుకున్న తీరు వారి జ్ఞాపక శక్తిని, కుశాగ్రబుద్ధిని తెలియజేస్తుంది" అని విశ్లేషించి చప్పట్లు కొట్టాడు.

మరి కొంతమంది చేతులు కలిపారు. మంత్రిగారికి ఆవేశం తుఫాను గోదావరిలా పెల్లుబికింది.

'నన్ను చూడండి. నేనిప్పటికి నాలుగు పెళ్లిళ్ల చేసుకున్నాను. ఏ ఒక్కతి కూడా ఏడాదికి మించి నాతో కాపురం చెయ్యలేదు. అటువంటిది ఈ వెంకట్రావు, సుందరమ్మ పదేళ్ల కాపురం చేశారంటే... నాకు మాటలు రావడం లేదు. వారిని పొగుడు తున్నాను. దీవిస్తున్నాను' అన్నాడు.

వాగుడుకాయ ఏదో అనబోతుండగా జనంలో కలకలం మొదలయింది. 'శుభకాంత్, శుభకాంత్'అని అరవసాగారు.

నిర్వాహకులు పి.టి. ఉష, అశ్వనీ నాచప్పలను మరపిస్తూ పరుగుదీశారు.

"వీళ్లు పరిగెత్తకపోతే ఆయన రాడా...?" కోపంగా సూర్యారావుతో అన్నాడు మంత్రి.

"ఆలస్యంగా వచ్చే వాడికే మన దేశంలో విలువ ఎక్కువ" అన్నాడు సూర్యారావు.

శుభకాంత్ వేదిక నలంకరించాడు.

పద్మభూషణ్ మైకు అందుకున్నాడు.

'డైలాగులు చెప్పడంలో తనకు తానే సాటి అనిపించుకున్న ది గ్రేట్ హీరో శుభకాంత్ గారు ఇప్పుడు మాట్లాడి తన అభిమానులను అలరిస్తారు' అనౌన్స్ చేశాడు.

శుభకాంత్ స్టైల్‌గా నవ్వాడు.

"నా అభిమానుల్లారా... ఆడపడుచుల్లారా... ఈ వెంకట్రావ్, అందాల రాశి సుందరి పెళ్లి చేసుకుని పది సంవత్సరాలయిందంటే నాకు నిజమనిపించడంలేదు. అసలు ఒక భార్యా భర్త పది సంవత్సరాలు కాపురం చెయ్యడం సాధ్యమా? మా సినిమా రంగంలో ఎంతో మంది పెళ్లిళ్లు చేసుకుంటారు. ఫస్ట్ మ్యారేజ్ డేకు గ్రీటింగ్స్ పంపుదామంటే వాళ్లు విడిపోయినట్లు తెలుస్తుంది. మా రంగంలో ఎంతో మంది పది సంవత్సరాల పాటు ప్రేమించుకుంటారు. పెళ్లి చేసుకుని పది నెలల్లో విడాకులు తీసుకుంటారు."

చప్పట్లు మార్మోగాయి.

"వాడు ఏం వాగాడని పిచ్చి జనం చప్పట్లు కొడుతున్నారు?" అసూయగా అన్నాడు మంత్రి సూర్యారావుతో.

"వాడి ముఖం చూసి కొడుతున్నారు. లేకపోతే వాడి సొల్లు వాగుడికి చెప్పు తీసుకుని కొట్టాలి" వత్తాసు పలికాడు సూర్యారావు.

సుందరి, వెంకట్రావుల ముఖాలు ఆముదం కారుతూన్నాయి.

'ఆ వెధవలు ఏదో చెప్పగానే గంగిరెద్దుల్లా తలూపాము. వీళ్ల మాటలతో నాకు బిక్క చచ్చిపోతున్నది' అన్నది సుందరి.

వెంకట్రావు పరిస్థితీ అలాగే ఉన్నది. శుభకాంత్ ఉపన్యాసం మళ్లీ మొదలైంది.

"మా సినిమా రంగంలో ప్రేమలు గగన కుసుమాలు. నిజానికి తిలోత్తమ, నేను ప్రేమించు కున్నాం. ఆరేళ్లనుండీ మా ప్రేమాయణం సాగుతున్నా ఆమె తల్లి ఏ మాత్రం అభ్యంతరం చెప్పలేదు. కానీ పెళ్లి చేసుకుంటానంటే మాత్రం నాకు అంతకు ముందే పెళ్లి అయిందని, ఇద్దరు మనవలు కూడా ఉన్నారని అభ్యంతరం చెప్పింది. మనవలు ఉండటం నా తప్పా? హె...హె... నాకు పదమూడేళ్లకు పెళ్లయింది. పధ్నాలుగేళ్లకు అబ్బాయి పుట్టాడు. వాడికి పదమూడేళ్లకు పెళ్లి చేసాం. సంవత్సరం తిరిగే సరికి వాడికి అబ్బాయి పుట్టాడు. ఎలా చూసినా నా వయస్సు ముప్ఫై ఏళ్లకు మించి లేవు. ఇది పెళ్లి చేసుకునే వయసు కాదా? ఆఁ.... చెప్పండి...." అని ప్రేక్షకుల వైపు చూశాడు.

"అవును... అవును.." అని కేకలు వేశారు కొంతమంది.

"అసలు విసయం వదిలేసి ఏమిటో మాట్లాడు తున్నాడు" అన్నది సుందరి వెంకట్రావు చెవిలో.

"అందుకే వాడికి 'అసందర్భ ప్రలాపి' అని బిరుదిచ్చారు" జవాబిచ్చాడు వెంకట్రావు.

"మరి ఇటువంటి ఈ రోజుల్లో ఈ దంపతులిద్దరూ పదేళ్లు దిగ్విజయంగా కాపురం చేశారంటే ఏదో సస్పెన్స్ సినిమావలే ఉంది. వారిని సన్మానించి శివం ఆర్ట్స్ వారు ఒక ఘనకార్యం చేశారనుకుం టున్నాను. ఆదర్శదంపతులు అనే బిరుదు వారి కివ్వడం ఎంతైనా సముచితం" అని ముగించాడు శుభకాంత్.

వేదిక ఎక్కిన పెద్దలందరూ చుట్టూ చేరి దంపతులకు పూల మాలలు వేసి శాలువాలు కప్పారు. ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీశారు. వెంకట్రావును మాట్లాడవలసిందిగా కోరాడు సూర్యారావు.

"అందరికీ నమస్కారం. భార్యాభర్తలు పదేళ్లపాటు కలిసి కాపురం చెయ్యడం అనేది గొప్ప విశేషమని నాకు ఇంతవరకూ తెలియదు. మనం కలిసి ఉంటూ ఒక ఘనకార్యం చేస్తున్నామని మేము ఎప్పుడూ అనుకోలేదు కూడా. కానీ ఇంత మంది పెద్దలు దీన్ని ఒక విశేషంగా చెబుతుంటే నిజమేనేమో అనిపిస్తుంది. ఇలా మాకు కూడా సన్మానం చేయించుకోవడానికి ఒక కారణం ఉన్నందుకు చాలా ఆనందంగా ఉంది. ధన్యవాదాలు" ముగించాడు వెంకట్రావు.

ఇంటికి రాగానే సుందరి అన్నది. "ఏమండీ! 'ఆదర్శదంపతులు' అని ఎవరి చేతో అనిపించుకోవడానికి పాతిక వేలు ఖర్చు పెట్టాల్నా?"

వెంకట్రావు ముఖం జేవురించింది. 'ఈ ఆలోచన మొదటే ఉంటే పాతిక వేలు పెట్టి నీకు మంచి గొలుసో, నాకు మంచి స్కూటరో కొనుక్కుని ఉండే వాళ్లం. పాతిక వేలు పెట్టి పాతిక రూపాయలు కూడా విలువ చెయ్యని ఈ ముదనష్టపు చెక్క బొమ్మను తెచ్చుకున్నాం' అని చేతలో ఉన్న మెమెంటోను విసిరి నేలకేసి కొట్టాడు.

●

